

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:30 (గురువారం సాయంత్రం)
సహర్ 4:55 (శుక్రవారం ఉదయం)

రాజీవ్ ఆరోగ్యశ్రీ సమాచారం ఇక మీ చేతుల్లో.... 7

కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ధర్నా




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సుభాష్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు 26 వేల రూపాయల కనీస వేతనం చెల్లించాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్ మున్సిపల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. చాలీచాలని జీతాలతో ఇంటి కిరాయి, పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు.మున్సిపల్‌లో జవాన్లుగా కొత్తవారిని తీసుకుంటున్నారని తెలిపారు. 20 పంవత్సరాలుగా పారిశుధ్య కార్మికులుగానే పనిచేస్తున్నారని, అందులో చదువుకున్నవారు ఉన్నారని, అర్హతను బట్టి జవాన్లుగా అవకాశం కల్పించాలని కోరారు. సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, నెలకు ఎనిమిది చీపుర్లు ఇవ్వాలని, కార్మికులను వేధించే జవాన్లను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎల్ రూప్‌సింగ్, ఆకుల మ ల్లేశం, జిల్లా అధ్యక్షుడు దావు రాజమల్లయ్య, టౌన్ అధ్యక్షుడు గడ్డం సం పత్, కాడె చంద్రకళ, పారునంది ఎల్లయ్య, కత్తెరపాక రాజేందర్, బి రాజేశ్, ఎం జగన్,ం ాజేశ్వరి, కె స్వరూప, ఎం స్వామి, వీరస్వామి పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్

- రెండు రోజుల్లో 13 ఇళ్లలో చోరీ
- తాళంవేసి ఉన్న గృహాలే టార్గెట్



కరీంనగర్ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దొంగలు బాబోయ్... దొంగలు... తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలు చేస్తున్నారు. జిల్లాలో రెండు రోజుల్లో 12 ఇళ్లలో, ఒక మిర్చి యార్డులో దొంగతనాలు జరిగాయి. లక్షల రూపాయల సొత్తును లూటీ చేశారు. ఇళ్లలోకి చొచ్చుకెళుతున్న దొంగలు బంగారం, వెండి ఆభరణాలతోపాటు ద్విచక్రవాహనాలనూ ఎత్తుకుపోతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రొఫెషనల్ దొంగల ముఠాలు ఒకే రకమైన చోరీలకు పాల్పడే అవకాశముంటుందని, బైక్‌లను ముట్టరని కొందరు పోలీసులు చెబుతున్నారు. గంజాయి బ్యాచ్‌లే ఇటు వంటి దొంగతనాలకు పాల్పడి ఉంటాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గంజాయికి బానిసలుగా మారిన కొందు ముఠాలుగా ఏర్పడి డబ్బుల కోసం పగలంతా తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతూ విలువైన వస్తువులు, బంగారం, వెండి, నగదును, బైక్‌లను ఎత్తుకుపోతున్నారని పోలీసుల్లో చెబుతున్నారు. రెండు గ్రామాల్లో జరిగిన ఘటనల్లో తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని చోరీలు చేస్తున్నారు. ఒక వృద్ధురాలి ఇంటిలోకి వెళ్లి ఆమె మెడలోని పుస్తెలతాడును తెంపుకుని పారిపోయారు. ఒక ఇంటి ఆవరణలోని బైక్‌ను దొంగిలించారు. మరో చోట మిర్చియార్డులోకి వెళ్లి క్యాష్ కౌంటర్‌లోని 80 వేల నగదును ఎత్తుకుపోయారు.

> ఆదివారం అర్ధరాత్రి శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న ఎనిమిది ఇళ్లలోకి వెళ్లి భారీ ఎత్తున బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదు, బైక్, ఇతర విలువైన వస్తువులను ఎత్తుకుపోయారు. మంగళవారం అర్ధరాత్రి మానకొండూర్ మండలం అన్నారంలో నాలుగిళ్లలోకి వెళ్లి బంగారం, వెండి, నగదు, బైక్‌లను ఎత్తుకుపోయారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు రాత్రి గస్తీని పెంచాలని కోరుతున్నారు. పెట్రోలింగ్ వాహనంలో పోలీసులు తిరుగుతూ సైరన్ వేసుకుంటూ వెళుతున్నారు. దొంగలు ఆ సైరన్ విని పోలీసుల కంటపడకుండా చీకట్లో నక్కి, పోలీసులు వెళ్లిన తరువాత వారి పనిని కానిచ్చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

భయాందోళనలో ప్రజలు

రెండు రోజుల వ్యవధిలో 13 చోట్ల దొంగతనాలు జరిగి, లక్షల రూపాయల సొత్తును దోచుకుపోవడంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నా ఫలితం ఉండడం లేదు. రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచినట్లు పోలీసులు చెబుతున్నా దొంగతనాలు నియంత్రణలోకి రావడం లేదని విమర్శలు వస్తున్నాయి.

కరీంనగర్ బస్టాండ్‌లో ఆందోళన కలిగిస్తున్న చోరీలు

కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణీకుల సెల్‌ఫోన్‌లు, పర్సులు, బ్యాగ్‌లు చోరీకి గురవుతున్నాయి. నాలుగు రోజుల క్రితం గన్నేరువరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బస్సు ఎక్కుతున్న సమయంలో 20 వేల స్మార్ట్ సెల్‌ఫోన్‌ను కొట్టేశారు. అందకుముందు ఒక ప్రయాణీకురాలి హ్యాండ్ బ్యాగ్‌ను దొంగలు చోరీ చేసినట్లు తెలిసింది. కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో బస్టాండ్‌లో నిత్యం ప్రయాణికుల సెల్‌ఫోన్లు, పర్సులు, బ్యాగ్‌లు చోరీకి గురవుతున్నప్పటికీ దొంగలను గుర్తించలేకపోతున్నారు. వరంగల్, హన్మకొండ, నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్లలో ప్రతి ప్లాట్‌ఫాంకు ఇద్దరు వంతున ఆర్టీసీ సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసి ప్రయాణీకుల భద్రతకు ప్రాధానమిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు సీసీ కెమెరా ఉన్నచోటనే నిలపాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రయాణికుల వస్తువులు చోరీకి గురైన సమయంలో వెంటనే సీసీ కెమెరాలను పరిశీలిస్తే నిందితులు ఎవరనేది వెల్లడై త్వరగా పట్టుకునేందుకు వీలుంటుంది. చోరీకి గురైన సొమ్ములు రికవరీ అయ్యే అవకాశముంటుంది.

'పది' పరీక్షలకు 15 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన గణిత శాస్త్రం పరీక్షకు 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు ముగ్గురు పరీక్షలకు హాజరు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు తెలిపారు. 12,517 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 12,502 మంది రాశారని, ప్రైవేట్‌గా 10 మంది రాయాల్సి ఉండగా ఏడుగురు పరీక్షకు హాజరయ్యా రని చెప్పారు. 20 కేంద్రా ల్లో ప్రత్యేక తనిఖీ బృందాలు, నాలుగు కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్, ఐదు కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి, మొత్తం 29 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశార న్నారు. ఎలాంటి అవాంచనీయ సం ఘటనలు జరగలేదని, కాపీయింగ్ లే కుండా ప్రశాంతంగా విద్యార్థులు పరీ క్షలు రాస్తున్నారని డీఈవో తెలిపారు.

మొబైల్ అల్ట్రాసౌండ్ మెషీన్ సీజ్

సుభాష్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తు న్నారు. అందులో భాగంగా నగరంలోని ఓ మెటర్నటి ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ లేని మొబైల్ అల్ట్రా సౌండ్ మెషీన్‌ను అధికా రులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎం హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ మాట్లా డుతూ రిజిస్ట్రేషన్ లేని మొబైల్ అల్ట్రా సౌండ్ ఉన్నట్లు గుర్తించి నోటీసు ఇచ్చి సీజ్ చేశామన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, ధరల పట్టిక, సరైన రికార్డుల నిర్వహణ ఉండాలన్నారు. ఈ తనిఖీలు కొనసా గుతాయని తెలిపారు. కార్య క్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాములు, జూని యర్ అసిస్టెంట్ బాపుదేవ్, ఏఎస్‌ఐ విజయమణి, పీవోడీటీటీ డాక్టర్ ఉమాశ్రీ, పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సనాజవేరియా, సఖి కన్సల్టెంట్ డి లక్ష్మి, డాటాఎంట్రీ ఆపరేటర్ రమేశ్, డెమో రాజగోపాల్, సూపర్‌వైజర్ సయ్యద్ సబీర్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ



- ఐదు రోజుల్లో చెల్లించిన వారికే 'ఓటీఎస్' వర్తింపు

కరీంనగర్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆస్తిపన్ను బకాయిల వడ్డీని 90శాతం మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ (ఓటీఎస్)ను అమల్లోకి తెచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలన్నీటిని ఒకేసారి చెల్లించిన వారికి 90 శాతం వడ్డీని మాఫీ చేస్తూ మంగళవారం జీవో ఆర్టీ నంబర్ 154, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ తేదీ 25.3.2025ను జారీ చేసింది. ఇప్పటికే ఆస్తి పన్ను బకాయిలను వడ్డీతో సహా చెల్లించిన ఇంటి యజమానులకు వచ్చే ఏడాది ఆస్తిపన్నుల్లో 90 శాతం వడ్డీ మాఫీని వర్తింపజేస్తూ మిగిలిన పన్నులను వసూలు చేయాలని సూచించింది. జిల్లాలో కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలు ఉండగా, కొత్తపల్లి మున్సిపాలిటీని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లోనే కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేసింది. దీంతో కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు విలీనమైన కొత్తపల్లి మున్సిపాలిటీతో కలిసి నగరపాలక సంస్థకు దాదాపు 50 కోట్ల రూపాయల ఆస్తిపన్నులు వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో మంగళవారం వరకు సుమారు 33 కోట్ల రూపాయల మేరకు ఆస్తి పన్నులు వసూలయ్యాయి. మిగిలిన 17 కోట్లలో బకాయిలే ఎక్కువగా ఉండడంతో 90 శాతం వడ్డీ మాఫీ పథకాన్ని అమలులోకి తేవడంతో బల్దియా ఆదాయం ఐదు కోట్ల నుంచి ఎనిమిది కోట్ల మేరకు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు వడ్డీతో కలిపి ఆస్తిపన్నులు చెల్లించిన ఇంటి యజమా నులకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో వడ్డీలోని 90 శాతం ఆస్తిపన్ను చెల్లించినట్లుగా జమ చేయాల్సి ఉండడంతో మరో కోటి రూపాయల మేరకు ఆదా యం తగ్గవచ్చని భావిస్తున్నారు. బకాయిలపై వడ్డీ మాఫీ పథకంతో ఎక్కువగా లబ్ధిపొందేది నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలేనని, మిగిలిన మున్సిపాలిటీల్లో అంతగా ప్రభావం ఉండదని చెబుతున్నారు. ఈ వడ్డీ మాఫీ పథకాన్ని గ్రేటర్ హైదరాబాద్‌కే పరిమితిన చేసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు వర్తింప జేసింది. ఈ పథకాన్ని మార్చి మొదటి వారంలో ప్రకటిస్తే ఇప్పటి వరకు చాలా మేరకు వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని పన్నులు చెల్లించేవారు. నెలాఖరులోగా ఆర్థిక సంవత్సరం ముగియనుండగా ఐదు రోజుల గడువుతోనే ఈ వడ్డీ మాఫీ పథకాన్ని అమల్లోకి తేవడంతో ప్రజల నుంచి ఆశించిన మేరకు స్పందన రాకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

కరీంనగర్‌లో భారీగా బకాయిలు

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్నులు 50 కోట్ల వరకు వసూలు కావాల్సి ఉండగా మంగళవారం వరకు 33 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా 38,654 మంది తమ ఆస్తిపన్నులను చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం వడ్డీ మాఫీ పథకాన్ని అమలులోకి తెచ్చినందున వెంటనే ఆస్తిపన్ను బకాయిలను ఏకమొత్తంలో చెల్లించి వడ్డీ భారాన్ని తగ్గించుకోవాలని, నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపాలిటీల్లో 90 శాతానికి ఆస్తిపన్నులు వసూలు కాగా, చొప్పదండిలో కూడా బకాయిలు తక్కువగానే ఉన్నాయి. ఆస్తిపన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ పథకాన్ని ప్రజలు స్వాగతిస్తూనే ఈ గడువును కనీసం మరో 15 రోజులు పొడగిస్తే బాగుంటుందని అంటున్నారు. మార్చి 31 లోగా చెల్లిస్తేనే వడ్డీ మాఫీ వర్తిస్తుందంటూ గడువు విధించారని, ఈ ఐదు రోజుల్లో 30వ తేదీన ఉగాది, 31న రంజాన్ పండుగలు ఉన్నందున వడ్డీ మాఫీ పథకాన్ని పొడగించాలని ప్రజలు కోరుతున్నారు. వడ్డీ మాఫీ గడువును పొడగిస్తేనే వంద శాతం ఆస్తిపన్ను వసూలవుతాయని, ఐదురోజుల్లో టార్గెట్ చేరుకోవడం కష్టమేనని మున్సిపల్ అధికారులు అంటున్నారు.

సన్న బియ్యం వచ్చాయి..



హుజూరాబాద్ రేషన్ దుకాణంలో సన్న బియ్యం

హుజూరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇచ్చే దొడ్డు బియ్యం పక్కదారి పడుతున్నాయనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం ఇవ్వడానికి ముందుకొచ్చింది. ఇందు కోసం గత వానాకాలం సీజన్‌లో రైతుల వద్ద నుంచి సన్న వరిధాన్యాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేసింది. వీటిని మరపట్టించి గోదాముల్లో నిల్వ చేసి ఉంచారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఉగాది రోజున ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. దీంతో హుజూరాబాద్, జమ్మికుంట ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌకధరల దుకాణాలకు సన్న బియ్యాన్ని మూడ్రోజులుగా లారీల్లో తీసుకువచ్చి అన్‌లోడ్ చేస్తున్నారు. ఈ బియ్యాన్ని ఏప్రిల్ నెల నుంచి ఇవ్వడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. హుజూరాబాద్ డివిజన్‌లో జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాలు, 93,631 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 16,483 క్వింటాళ్ల సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. గతంలో చౌకధరల దుకాణాల నుంచి లబ్ధిదారులు దొడ్డు బియ్యాన్ని తీసుకెళ్లి, కిలో బియ్యాన్ని ఎనిమిది నుంచి 10 రూపాయల వరకు విక్రయించారు. ఆ బియ్యాన్నే మళ్లీ రైస్ మిల్లుల వ్యాపారులు కొనుగోలు చేసి ప్రభుత్వానికి అంటగట్టారు. ఈ దొడ్డు బియ్యాన్ని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్ తదితర రాష్ట్రాలకు తరలించేవారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తే పేదలకు ఉపయోగకరంగా ఉంటుందని ఈ పథకాన్ని ప్రవేశపెడుతున్నారు.

డివిజన్‌లోని రేషన్‌కార్డులు, సన్న బియ్యం వివరాలు..

మండలం	రేషన్ కార్డులు	క్వింటాళ్లు
1. జమ్మికుంట	21,235	3,777
2. వీణవంక	14,871	2,597
3. శంకరపట్నం	14,027	2,497
4. హుజూరాబాద్	20,958	3,758
5. సైదాపూర్	12,523	2,178
6. ఇల్లందకుంట	10,017	1,676
మొత్తం:	93,631	16,483

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలి

కరీంనగర్ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలపై జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నమోదైన అట్రాసిటీ కేసులు, పరిష్కరించిన కేసులు, బాధితులకు అందిన పరిహారం వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేసుల్లో అవసరమయ్యే కుల ధ్రువీకరణ పత్రం వీలైనంత త్వరగా జారీ చేయాలన్నారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేష్, డీటీడీవో జనార్దన్, బీఎండబ్ల్యూ పవన్ కుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, ఏసీపీ వెంకటస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

రైతు సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్

భగత్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా, బీజేపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న నిరసన దీక్ష చేపడుతున్నామన్నారు. కలెక్టరేట్ వద్ద రెండు గంటల నిరసన దీక్షా కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. రైతు సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు వాస్తవ పరిస్థితులకు పొంతనలేకుండా ఉందన్నారు. జిల్లాలో వేలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకో వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిలపు రమేష్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, యాదగిరి, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు సింగి రెడ్డి కృష్ణారెడ్డి, కరివేద మహిపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

ఎండలు మండుతున్నాయ్..

రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయి. జిల్లాలో బుధవారం అత్యధికంగా 39.1 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండడంతో ప్రజలకు బయటకు వెళ్లలేకపోతున్నారు. జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతం నిర్మానుష్యంగా కనిపిస్తోంది. చిరు వ్యాపారులు, కూలి పని చేసుకునే వారు ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్



నిర్మానుష్యంగా ఉన్న కరీంనగర్ మార్కెట్ ప్రాంతం

తండ్రి మృతిని తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య

కోల్‌సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో తండ్రి మరణించడంతో తట్టుకోలేక మానసిక క్షోభతో అతని కుమారుడు గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన ఆచంట శివశంకర్(42) బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివశంకర్ ఎన్‌టీపీసీలో క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. అతని తండ్రి 20రోజుల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆందోళనకు గురయ్యాడని, బుధవారం ఇద్దరు పిల్లలను స్కూల్‌లో దిగబెట్టిన శివశంకర్ ఇంటికి వచ్చాడని, అప్పటికే భార్య టైలరింగ్ చేసేందుకు బయటికి వెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇంట్లో ఒంటిరిగా ఉన్న ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లహరి అలియాస్ వెంగమాంబ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భూమేష్ పేర్కొన్నారు.

యువకుడి బలవన్మరణం


నవీన్ (ఫైల్)

ధర్మారం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్యహత్య చేసుకున్న ఘటన కొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నెరువట్ల నవీన్ (29) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నవీన్ ప్రవర్తనతో విసుగు చెందిన అతని భార్య పిల్లలు ఇల్లు వదిలివెళ్లిపోయారు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న నవీన్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిచంగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి తమ్ముడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ శీలం నరేష్ తెలిపారు.

పాఠాలు చెబుతూ కుప్పకూలిన టీచర్

● ఆసుపత్రిలో మృతి


అనురాధ(ఫైల్)

మల్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న బోగ అనురాధ(43) అనే ఉపాధ్యాయురాలు బుధవారం గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందింది. అనురాధ భోజన విరామం అనంతరం విద్యార్థులకు పాఠాలు చెబుతుండగానే గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పాఠశాల యాజమాన్యం వెంటనే అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేక గుండెపోటుతో మృతిచెందింది. ఉపాధ్యాయురాలి మృతితో పాఠశాలలో విషాదం నెలకొంది.

రిజర్వాయర్‌లో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

గొల్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రంగదాముసిపల్లె రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి చెరువులో మంగళవారం గల్లంతైన బాలుడు నేరెళ్ల నరేష్(12) మృతదేహం బుధవారం లభ్యమైంది. రంగదామునిపల్లె గ్రామంలో నేరెళ్ల లక్ష్మీ-పోచయ్య దంపతుల చిన్న కొడుకైన నరేష్ స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి మంగళవారం రంగదామునిపల్లె రిజర్వాయర్‌లోకి సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా, తనకు ఈత రాకపోవడంతో నరేష్ మరోచోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు. ఈత నేర్చుకునేందుకు నీటిలోకి దిగిన నరేష్ ఎంతసేపటికీ పైకి రాకపోవడంతో గమనించిన మిత్రులు భయంతో ఊరిలోకి పరుగులు తీసికుటుంబ సభ్యులకు సమాచారమందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ రంగదాముడిపల్లె రిజర్వాయర్‌లోకి గజఈతగాళ్లను దింపి బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మృతదేహం లభ్యమైంది. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల జిల్లాప్రధానాసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాడలేని సెంట్రల్ లైటింగ్

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ● రాత్రి సమయాల్లో ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు

వేములవాడ టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక వాహనదారుల సౌకర్యార్థం నాలుగు వరసల రోడ్డును ఏర్పాటుచేసినా సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయం జంక్షన్ నుంచి వేములవాడకు వచ్చే నందికమాన్ వరకు నాలుగు వరుసల రోడ్డు వేసి మధ్యలో పూలమొక్కలను నాటి అందంగా తీర్చిదిద్దారు. అయితే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకోవడంతో రాత్రి సమయంలో వెలుతురు లేక ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు, భక్తులు వాపోతున్నారు.


సెంట్రల్ లైటింగ్ లేకుండా ఉన్న నందికమాన్-కలెక్టరేట్ రోడ్డు

తప్పని ఇబ్బందులు..

జిల్లా కేంద్రం నుంచి వేములవాడకు వచ్చే వాహనాలు లైటింగ్ లేకపోవడంతో వాహనాదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు హైదరాబాద్ నుంచి సిరిసిల్ల మీదుగా రాజన్న దర్శనానికి నిత్యం వేల సంఖ్యలో వాహనాల్లో ఆలయానికి వస్తున్నారు. అయితే రాత్రి సమయంలో వచ్చే భక్తులు లైటింగ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా నందికమాన్, గుర్రంవానిపల్లి, అగ్రహారం, చంద్రగిరి గ్రామాలకు చెందిన స్థానికులు రాత్రి సమయంలో రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టరేట్ నుంచి నందికమాన్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, నందికమాన్ నుంచి కొడుముంజ గ్రామం వరకు నాలుగు వరుసల రోడ్డు పూర్తి అయినా మధ్యలో పూల మొక్కులు నాటి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

రాత్రి వేళల్లో ఇబ్బందులు.. నాగుల రాము, సంకెపల్లి



నందికమాన్ నుంచి సిరిసిల్ల వెళ్లే రోడ్డులో రాత్రి సమయంలో చీకటిమయంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుర్రంవానిపల్లి సమీపంలో పాదచారులు నడుచుకుంటూ రోడ్డు దాటితే కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

లైటింగ్ ఏర్పాటు చేయాలి..: నేరేళ్ల కిరణ్, తిప్పాపూర్



రాజన్న ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివస్తారు. సెంట్రల్ లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి లైటింగ్ ఏర్పాటు చేసి స్థానికులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

కట్నం కోసం వేధించిన భర్త, అత్తమామలపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధించిన సంఘటనలో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన పోతుల రాజిరెడ్డితో పాటు అతని తల్లిదండ్రులు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని శిరీషకు కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేటకు చెందిన రాజిరెడ్డితో నాలుగేళ్ల కిందట వివాహమైందన్నారు. ఆ సమయంలో పుట్టింటి వారు రూ.2 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు ఇచ్చి పెళ్లి జరిపించారని చెప్పారు. కొంతకాలం తర్వాత భర్త రాజిరెడ్డి, అత్తమామలు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలు పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని శిరీషను వేధింపులకు గురి చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త రాజిరెడ్డి, అత్తమామలు నర్సవ్వ, మోహన్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

వ్యక్తిపై దాడి కేసులో ఏడాది జైలు శిక్ష

సిరిసిల్లక్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి కేసులో ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు టౌన్ సిరిసిల్ల సీఐ కె కృష్ణ తెలిపారు. సీఐతెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లపట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అంకారపు ప్రభాకర్ ఇంటికి ఉన్న టులెట్ బోర్డును 4 జూన్ 2017న పాత పగలు దృష్టిలో పెట్టుకొని ఇంటి పక్కన ఉన్న కాముని వనిత, కాముని అరుణ, వడ్డేపల్లి సుజాత అనేముగ్గురు తొలగించారు. దీంతో దుర్భాషలాడుతూ ప్రభాకర్ కర్రతో దాడి చేశాడని కాముని వనిత సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు అప్పటిసిరిసిల్ల ఏఎస్ఐ అనంతరెడ్డి అంకారపు ప్రభాకర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రావణ్ ఆధ్వ ర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేష్ పదిమంది సాక్షు లను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించగా, కేసుపూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎ.ప్రవీణ్ నేరంరుజువు కావడంతో నిందితుడైన అంకారపు ప్రభాకర్‌కు ఒక సంవత్సరం జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించినట్లు సిరిసిల్ల సీఐ కె కృష్ణ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

ఇల్లంతకుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న రెండువాహనాలను వేర్వేరుప్రదేశాల్లో పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. వెంకట్రావుపల్లె గ్రామంలోని కెనాల్ సమీపంలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని నిందితుడైన మల్కినగేష్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలోని కందికట్కూర్ గ్రామసమీపంలో ఇసుకను తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కందికట్కూర్ గ్రామానికి చెందిన దొమ్మాటి అజయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏఈవోకు గాయాలు

తంగళ్లపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఈవో అనూషకు గాయాలయ్యాయి. కట్కూర్‌ఏఈవో అనూష విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వస్తుండగా తంగళ్లపెల్లి మండలకేంద్రంలో కారుఢీకొని స్వల్పంగా గాయాలయ్యాయి.

ఖర్చుల కోసం చోరీలు

● మహిళ నుంచి బంగారం, నగదు స్వాధీనం

పెద్దపల్లిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఖర్చుల కోసం ఓ మహిళ చోరీ మార్గాన్ని ఎంచుకుంది. భర్త ఎనిమిదేళ్ల క్రితం మరణించడంతో కొన్నాళ్లపాటు హోటల్‌లో పనిచేసి తన ఇద్దరు కూతుళ్ల వివాహంచేసింది. అప్పులు తీర్చలేక, ఇంటి అవసరాలు వెళ్లదీయలేక దొంగగా మారింది. ఓబంగారం షాపులో చోరీకి పాల్పడి 24గంటల్లో పోలీసులకు చిక్కి కటకటాల పాలైంది. ఈఘటనకు సంబంధించి డీసీపీ పీ కరుణాకర్ ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన లోకిని తిరుమల సోమవారం పట్టణంలోని దేవరకొండ కరుణాకర్ బంగారు ఆభరణాల షాపులో దొంగతనానికి పథకం వేసింది. వెంట సుత్తి, స్క్రూడ్రైవర్ తీసుకువెళ్లి షెట్టర్ తాళం పగుగొట్టి తెరిచింది. కౌంటర్లకు తాళం వేసి ఉండగా స్క్రూ డ్రైవర్‌తో తెరిచి 100గ్రాముల బంగారం, 40వేల రూపాయల నగదు దోచుకెళ్లింది. యజమాని కరుణాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఏసీపీ గజ్జి కృష్ణ ఆధ్వర్యంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు మల్లేష్, సిబ్బందితో ఓబృందంగా ఏర్పడి క్లూస్‌టీం ఫింగర్ ప్రింట్స్ సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఓ మహిళ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే తిరుమలను అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం ఒప్పుకుంది. ఆమెనుంచి 100గ్రాముల బంగారం నగదు 28వేలరూపాయలు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ టాస్క్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించారు. వ్యాపారులు, ఇంటియజమానులు సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి, ప్రభాకర్, అనిల్‌కుమార్, రాజు, రమేష్ ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

తాటిచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడు మృతి

సైదాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘణపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి కింద పడి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల కనకయ్య (54)అనేగీతకార్మికుడు వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారీకిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

వివాదాస్పదమైన ఎస్సెస్సీ ఇన్విజిలేషన్

● కుమార్తె పరీక్ష కేంద్రంలో తండ్రి విధులు

కోరుట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కోరుట్లలోని గౌతమ్ మోడల్‌స్కూల్ పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేషన్ వివాదస్పదంగా మారింది. కుమార్తె పరీక్ష కేంద్రంలో తండ్రి ఇన్విజిలేటర్ నిర్వహించడం చర్చనీయాంశమైంది. పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్‌లో ఓ పదో తరగతి విద్యార్థినికి పరీక్ష కేంద్రం కేటాయించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కోరుట్ల పట్టణంలో పనిచేస్తున్నారు. వారికి కూతురు పరీక్షరాస్తున్న కేంద్రంలో ఇన్విజిలేటర్లుగా విధులునిర్వహించడానికి ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 21నతెలుగు పరీక్షకు ఎక్కువమంది సిబ్బందిని విధులకు కేటాయించడంతో విద్యార్థిని తల్లికి విధులు కేటాయించలేదు. తండ్రిమాత్రం ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహించాడు. ఇంగ్లీష్ పరీక్షరోజు కూడా ఆయన విధులకు హాజరయ్యాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిల్లలు పరీక్ష రాసే కేంద్రాల్లో తల్లిదండ్రులతో పాటు వారి బంధువులు ఎవరు ఉన్నా ఇన్విజిలేషన్‌కు అనుమతించరు. ఇందుకుగాను ఉపాధ్యాయులు ముందే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. సదరు ఉపాధ్యాయులు తమ కూతురు పరీక్ష రాసే విషయం తెలపకపోవడంతో వారికి విధులు కేటాయించారు. ఈ విషయం ఆలస్యంగా ఈనెల 24న బయటపడినట్లు సమాచారం. పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న తోటి ఇన్విజిలేటర్లు ఈ విషయం మండల విద్యాధికారికి నరేశంకు తెలవడంతో వెంటనే సెంటర్‌కు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. సదరు ఇన్విజిలేటర్ నుంచి ఎంఈవో డిక్లరేషన్ తీసుకొని ఉన్నతాధికారులకు నివేదించారు.

● ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ జారీ

కోరుట్ల రూరల్: ఎస్సెస్సీ పరీక్షలో ఇన్విజిలేషన్ వివాదస్పదంపై సదరు ఉపాధ్యాయుడికి బుధవారం జిల్లా విద్యాధికారి రాము షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు మండల విద్యాధికారి నరేశం తెలిపారు. పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రంలో తన కూతురు పరీక్ష రాస్తున్న విషయంలో జరుగుతున్న వివాదంపై జిల్లా విద్యాధికారి కార్యాలయానికి వచ్చి గురువారం వివరణ ఇవ్వాలని ఇవ్వాలని షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్నట్లు ఎంఈవో తెలిపారు.

అన్నారంలో దొంగల బీభత్సం

● తాళం వేసిన ఇళ్లే లక్ష్యం ● మూడు ఇళ్ల తాళాలు పగులగొట్టి నగదు, ఆభరణాలు చోరీ ● ఒక ఇంటిలో బైక్ అపహరణ ● రంగంలోకి దిగిన క్లూస్ టీం..

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న మూడు ఇళ్లల్లో దొంగలు పడి నగదు, వెండి, బంగారు ఆభరణాలు, బైక్‌ను దొంగిలించారు. ఒక కుటుంబం వారు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లారు. మరొక కుటుంబం వారు తన తమ్ముడి ఇంటిలో పడుకునేందుకు వెళ్లారు. మరో ఇంటిలో పడుకున్న మహిళ పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. రుద్రోజు వెంకటాచారి ఇంటిలో ముప్పావు తులం బంగారం, 18తులాల వెండి పట్టీలు, మధునాల వెంకటమ్మ ఇంటిలో 55తులాల వెండి పట్టీలు, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. పాకాల రాజిరెడ్డి ఇంటి ఆవరణలో పెట్టిన బైక్ ఎత్తుకెళ్లారు. గొట్టిముక్కల విజయ పుస్తెల తాడును తెంపే క్రమంలో మేల్కొన్న మహిళ అరుస్తూ దొంగ వెంబడి పరుగెత్తింది. అయినా ఫలితం లేకపోయింది. బుధవారం సమాచారం తెలుసుకున్న సీఐ లక్ష్మీనారాయణ దొంగతనానికి గురైన ఇండ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. కరీంనగర్ క్లూస్‌టీం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. అనంతరం గ్రామపంచాయతీలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

విద్యుత్ మోటారు తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువు సమీపంలోని రైతులు చల్ల కిష్టారెడ్డితో పాటు మరో రైతుకు సంబంధించిన వ్యవసాయ విద్యుత్ మోటారు తీగను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి అపహరించుకుపోయారు. సుమారు రూ.5వేల విలువ ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. చోరీపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

కరీంనగర్ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ఎస్‌హెచ్‌వో, ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం కొత్తపల్లి మండలం లోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీగా మద్యం పట్టుకు న్నారు. కొత్తపల్లి మండలం ఎలగందల్, బావుపేటలో నాలుగు బెల్ట్‌షాపులను సీజ్ చేశారు. రూ.26వేల విలువైన 40,735 లీటర్ల మద్యం పట్టుకున్నారు. నిర్వాహకులు రెడ్డివేని మనోహర్, దండు శంకరయ్య, గాలి రాజేష్, బోనాల దశరథంను అరెస్టు చేశారు.


పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్

మిర్చి యార్డులో దొంగతనం

● రూ.80వేలు చోరీ

తిమ్మాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజీవ్ రహదారిపై ఉన్న తిమ్మాపూర్ ఎండుమిర్చియార్డులో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడి కౌంటర్‌లో ఉన్న నగదును దొంగిలించారు. మిర్చి యార్డు నిర్వాహకుడు మడికంటి శ్రీనివాస్, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. శ్రీనివాస్ రోజులాగే మంగళవారం కూడా యార్డులో పనులు ముగించుకొని కరీంనగర్‌లోని ఇంటికివెళ్లాడు. బుధవారం ఉదయం ఉదయం తిరిగి యార్డుకు వచ్చిన క్రమంలో కౌంటర్ పగుల గొట్టి ఉంది. అందులో పెట్టిన నగదు లేకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. వెంటనే ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై వివేక్‌తోపాటు క్లూస్‌టీం పోలీసులు మిర్చియార్డుకు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. యార్డులోఉన్న సీసీ పుటేజ్ పరిశీలించగా అందులో ఇద్దరు దొంగలు వచ్చి డబ్బులు దొంగిలించుకు పోయినట్లు గుర్తించారు. రాత్రి మిర్చిలోడ్‌వస్తుందని శ్రీనివాస్ రూ.80వేలు కౌంటర్‌లో పెట్టి వెళ్లాడు. మిర్చిలోడ్ రాకపోవడంతో డబ్బులు అందులోనే ఉండిపోయాయి. వాటినే దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై తెలిపారు.


యార్డులో వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం

రామగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని కొండా లక్ష్మణ్ తెలంగాణరాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు డాక్టర్ విజయ పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన రత్నాపూర్ కృషి విజ్ఞానకేంద్ర 13వ శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రంలో సాగుతున్న పండ్ల తోటలు, కూరగాయల సాగును క్షేత్రస్థాయిలో సందర్శించారు. అనంతరం కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు గత సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలు, వచ్చే సంవత్సరం చేపట్టాబోయే కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా వివరించారు. వ్యవసాయపంటల సాగుతో పోల్చుకుంటే ఉద్యానపంటలు పండ్లు,కూరగాయలు, పూలసాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని విజయ పేర్కొన్నారు. వాటికి అవసరమయ్యే శాస్త్ర,సాంకేతిక సహకారాన్ని విశ్వవిద్యాలయం అందిస్తుందని తెలిపారు. సమావేశంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ రాజిరెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీధర్‌సిద్ధి, ఉషారాణి, వ్యవసాయసంయుక్త సంచాలకులు అంజనీదేవి, నాబార్డ్ ఏజీఎం ప్రకాశ్, పీడీ డీఆర్‌డీఏ కలిందిని జిల్లా పశుపోషణ అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకురాలు విజయ

మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలు : సీఐ

కరీంనగర్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల వినియోగం అనర్థదాయక మని, యువత వాటిజోలికి వెళ్లవద్దని కరీంన గర్ మహిళాథాణా సీఐ పి శ్రీలత అన్నారు. ప్రభుత్వమహిళా డిగ్రీకళాశాలలో ఈరోజు మత్తుపదార్థాల వినియోగం-అనర్థాలపై అవగాహనసదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ శ్రీలత మాట్లాడుతూ లుక్‌కంటే బుక్ గొప్పవని, తనఅనుభవాలను చెబుతూ విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. విద్యార్థులు మత్తుకు బానిసలుకాకుండా ఉజ్వలభవిష్యత్‌ను తీర్చిదిద్దుకో వాలన్నారు. ఒకసారి మత్తుకు బానిసగా మారితే అతని జీవితంతోపాటు కుటుంబం కూడా చిన్నాభిన్నం అవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి వరలక్ష్మి మాట్లాడుతూ మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల విలువైన జీవితాలను కోల్పోతూ, కుటుంబానికి, సమాజానికీతీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నారని అన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో మత్తుపదార్థాల నిరోధకకమిటీ అధ్యక్షుడు లక్ష్మణరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొగిలి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కుక్క మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని పెంపుడు కుక్క మృత్యువాత పడింది. కుక్క యజమాని కంకణాల బాలలింగం ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలలింగం ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ మామిండ్ల వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ సమాచారం

ఇక మీ చేతుల్లో..

సుభాష్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల సమాచారం ఇక మీ చేతిలో అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు పెంచింది. ఈ పథకంలో ఇటీవల 163 వైద్య చికిత్సలను కొత్తగా చేర్చింది. మొత్తంగా 1,835 చికిత్సలు చేసుకోవచ్చు. ఆరోగ్యశ్రీ కార్డును ఆమోదించే ఆసుపత్రుల్లో మాత్రమే ఉచిత వైద్యం పొందే అవకాశం ఉంటుంది. మీ సమీపంలో ఏ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు ఉన్నాయనే సమాచారం ఇకపై మొబైల్ ఫోన్, కంప్యూటర్‌లలో సులువుగా తెలుసుకోవచ్చు.

● కంప్యూటర్ లేదా స్మార్ట్ ఫోన్‌లో ముందుగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పోర్టల్ www.rajivarogyasri. telangana.gov.inలోకి వెళ్లాలి. అనంతరం టాప్ సర్వీస్ బార్‌లో కనిపించే హాస్పిటల్స్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అపుడు రాజీవ్ ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్ అనే దానిపై క్లిక్ చేస్తే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. ఈ మూడు ఆప్షన్ల ద్వారా దగ్గర్లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రులను తెలుసుకోవచ్చు. మీరు ఎంచుకున్న ఆప్షన్లపై క్లిక్‌చేస్తే కొత్తపేజీ ఓపెన్ అవుతుంది. మీరు ఎంచుకున్నదాని ప్రకారం సెర్చ్ ఆప్షన్‌లో మీ జిల్లా, మీ మండలం హాస్పిటల్, స్పెషాలిటీ, ప్రభుత్వ లేదా ప్రైవేటుని ఎంపిక చేసుకోవాలి. అనంతరం అందుబాటులో ఉన్న ఆసుపత్రులు కనిపిస్తాయి. ఆసుపత్రి చిరునామా, ఆరోగ్య మిత్ర సభ్యుల పేర్లు, వారి ఫోను నంబర్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద అందించే సేవల వివరాలు చూడవచ్చు.

● ఇంకా ఏమైనా సమాచారం లేదా సందేహం ఉంటే మీరు వెళ్లాలనుకుంటున్న ఆసుపత్రి ఆరోగ్య మిత్ర సభ్యులను సంప్రదించవచ్చు. అక్కడ మీకు కావలసిన వైద్య సేవలు ఉన్నాయో లేవో తెలుసుకొని, సమయం వృథా కాకుండా చూసుకోవాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎం రాజు తెలిపారు.

జిల్లాల వారీగా ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల వివరాలు..

కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు కలిపి మొత్తం 52 ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, డాక్టర్ భూంరెడ్డి హాస్పిటల్, అమృత నర్సింగ్‌హోం, అపోలోరీచ్, మెడికవర్, సరోజిని హాస్పిటల్, శ్రీరామ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, ఓమెగా సుశ్రుత క్యాన్సర్ హాస్పిటల్, వెంకటేశ్వర కిడ్నీ సెంటర్, చల్మెడ మెడికల్ కాలేజీ, ప్రతిమ మెడికల్ కాలేజీ, సూర్య నర్సింగ్‌హోం, సన్‌షైన్ హాస్పిటల్, సంజీవని నర్సింగ్‌హోం, అక్షయ మల్టీస్పెషాలిటీ, ఆదర్శ హాస్పిటల్, మురుగన్ హాస్పిటల్, శ్రీకృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, రెనీ హాస్పిటల్, వన్ హాస్పిటల్, సీవీఎం హాస్పిటల్, డాక్టర్ శరత్ మ్యాక్స్‌విజన్ ఐ హాస్పిటల్, రిషిక చిల్డ్రన్స్ హాస్పిటల్ జమ్మికుంట, హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి (ప్రభుత్వ), జమ్మికుంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్(ప్రభుత్వ)

జగిత్యాల జిల్లాలో..

జగిత్యాల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, గీతా ఆర్థోపెడిక్, మెటర్నిటీ నర్సింగ్ హోం, అమృత, త్రినేత్ర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, సాయి సంజీవని హాస్పిటల్, శివసాయి హాస్పిటల్, పావని ఐ హాస్పిటల్, తిరుమల నర్సింగ్‌హోం, ఓం సాయిరాం మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెట్‌పల్లి (ప్రభుత్వ), ధర్మపురి ఏరియా హాస్పిటల్ (ప్రభుత్వ), కోరుట్ల ఏరియా హాస్పిటల్ (ప్రభుత్వ), రాయికల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ)

రాజన్న సిరిసిల్ల జిల్లాలో...

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, గంభీరావుపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, వేములవాడ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ఎల్లారెడ్డిపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, సిరి హాస్పిటల్, అశ్విని హాస్పిటల్

పెద్దపల్లి జిల్లాలో....

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రామగుండం, మంథని ఏరియా ఆసుపత్రి, పెద్దపల్లి ఏరియా ఆసుపత్రి, సుల్తానాబాద్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, విజయ హాస్పిటల్.



రాజన్న హుండీ ఆదాయం
రూ. 1.95 కోట్లు

బంగారం 287 గ్రాములు, వెండి 18.5 కిలోలు

వేములవాడ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత నడుమ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 రోజుల హుండీలను బుధవారం లెక్కించారు. నగదు రూ కోటి 95 లక్షల 75 వేల 168 లభించగా, 287 గ్రాముల బంగారం, 18.500 కిలోల వెండి లభించింది. అలాగే నాంపల్లి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో 6 నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ 11 లక్షల 47వేల 510 ఆదాయం లభించింది. హుండీ లెక్కింపును ఈవో వినోద్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేములవాడలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అంజన్న హుండీ ఆదాయం రూ1.09కోట్లు

మల్యాల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,09,13,339నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. 55 రోజులకుగాను ఆలయంలోని 12 హుండీలను బుధవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 109 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్,అధికారులు, సిబ్బంది, శ్రీలలిత సేవా ట్రస్ట్ సభ్యులు, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొండగట్టులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

హుండీల్లోనే బంగారం, వెండి

ఇన్నాళ్లు హుండీలలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండిని తూకం వేయగా ఈ సారి వాటిని తూకం వేయకుండానే సంచిలో సీజ్ చేసి మళ్లీ హుండీలలోనే వేశారు. వాటిని మరోసారి జరిపే హుండీల లెక్కింపు సందర్భంగా దేవాదాయ శాఖ జూవెలరీ అధికారుల సమక్షంలో తూకం వేయడానికి గాను సీజ్ చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. గతంలో లేని విధంగా మళ్లీ హుండీలలోనే సీజ్ చేసి వేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రిజర్వేషన్ ఫలాలు
అందరికీ అందించడమే లక్ష్యం..

● బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ● రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటన





సిరిసిల్లలో పర్యటిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బృందం, వేములవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్

సిరిసిల్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ ఫలాలు బీసీలందరికి అందించడమే లక్ష్యమని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్, గీతానగర్‌లలో పర్యటించారు. పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మలి తదితర కులాల స్థితిగతులను తెలుసుకునే దిశగా వారితో సమావేశం అయ్యారు. తమ్మల కులానికి శూద్ర, నాన్ బ్రాహ్మణ్ పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వడంతో అర్చక, ఇతర ఉద్యోగాల్లో ఇబ్బందులు పడుతున్నామని తమ్మల పేరిట కులం సర్టిఫికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కులం సర్టిఫికెట్‌లలో తమ కులం పేరును వంశీయులుగా మార్చాలని దొమ్మరి కులం బాధ్యులు కోరారు. దొమ్మరి కులం పేరు ఉండడంతో సమాజంలో ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వ సంస్థలు, విద్యాలయాల్లో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కులం పేరు సమస్యపైనే అధ్యయనం చేయడానికి వచ్చామని కమిషన్ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, తహసీల్దార్ మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, బీసీ సంక్షేమ అధికారి రాజమనోహర్‌రావు, తదితరులు ఉన్నారు.

వెనుకబడిన కులాల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం

వేములవాడ : బీసీ సామాజిక వర్గంలోని వెనుకబడిన కులాలైన పిచ్చగుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మల కులాల స్థితిగతులపై రాష్ట్ర బీసీ కమిషన్ సమగ్ర అధ్యయనం చేస్తున్నదని కమిషన్ చైర్మన్ జి నిరంజన్ తెలిపారు. బుధవారం ఆయనతో పాటు కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి వేములవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు న్యూ అర్బన్ కాలనీలో వెనుకబడిన సామాజిక వర్గమైన పిచ్చగుంట్ల కులానికి చెందిన పలువురి ఇళ్లను సందర్శించి వారి జీవన స్థితిగతులను, జీవనోపాధి కోసం వారు పడుతున్న కష్టాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సోషియో ఎకనామిక్ కుల గణన సర్వే నిర్వహించి, అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు ఆమోదించిందని వెల్లడించారు. కులం పేరును విద్యాలయాలు, ఉద్యోగ స్థలాల్లో పిలుచుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని, ఇప్పుడున్న కులాల పేర్లకు ప్రత్యామ్నాయ పేరు ఇవ్వాలని ఆయా కులాల నుంచి విజ్ఞప్తులు అందాయని తెలిపారు. సమగ్ర అధ్యయనం అనంతరం వచ్చే నెల రెండో వారంలో జరిగే బీసీ కమిషన్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొందిన నేపథ్యంలో బిల్లు చట్టరూపం దాల్చాలని రాజరాజేశ్వర స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. బీసీ సంక్షేమ అధికారి రాజ మనోహర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వచ్చే నెల 3 వరకు
రైల్వే గేటు మూసివేత

కొడిమ్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్-అప్పారావుపేట గ్రామాల మధ్య ఉన్న రైల్వేగేటును మరమ్మతు పనుల దృష్ట్యా గురువారం నుంచి ఏప్రిల్ 3 వరకు గేట్ మూసివేయ నున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ప్రయాణికులు సహకరించాలని బుధవారం సంబంధిత గ్రామ పంచాయతీల అధికారులకు, రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారమందించారు. రైల్వే గేటు మరమ్మతు విషయమై నోటీసు అందినట్లు కొడిమ్యాల తహసీల్దార్ జి.రమేష్, పూడూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి తెలిపారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ..

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాలేదు. వరంగల్ నుంచి నిజామాబాద్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు, కరీంనగర్ నుంచి హుజురాబాద్ వైపు వస్తున్న లారీ గట్టుదుద్దెనపల్లి కాకతీయ కాల్వపై ఉన్న వంతెనపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగాలు ధ్వంసం కాగా ఎవరికీ ప్రమాదం జరగలేదు. ప్రమాదంలో ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం తెలుసుకున్న సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రాకపోకలను పునరుద్ధరించారు.

మార్కెట్ సౌకర్యం లేక
మామిడి రైతుల ఇక్కట్లు

రాయికల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

రాయికల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలో మామిడికి మార్కెట్ సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల జిల్లాలో అత్యధికంగా మామిడి తోటల విస్తీర్ణం రాయికల్ మండలంలోనే ఉంది. ప్రతియేటా జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాలకు మామిడిని రైతులు తరలించి విక్రయిస్తున్నారు. స్థానికంగా కొనుగోలు కేంద్రం లేక పోవడంతో రైతులకు రవాణా భారం పడుతోంది. రాయికల్ మండల వ్యాప్తంగా 4300 మంది రైతులు 10,500 ఎకరాల్లో మామిడి పంటలు సాగు చేస్తున్నారు. మూటపెల్లి, కొత్తపేట, భూపతిపూర్, రామాజీ పేట, ఒడ్డెలింగాపూర్, చింతలూరు, తాట్లవాయి, అల్లీపూర్, కిష్టంపేట, సింగరావుపేట గ్రామాల్లో అత్యధికంగా మామిడి తోటలు ఉన్నాయి. ప్రతి యేటా రైతులు విక్రయాలకు పట్టణ ప్రాంతాలకు తీసుకువెళ్లడం, అక్కడ రేటు వచ్చేదాకా వేచి ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగ్‌పూర్ తదితర మార్కెట్‌లలో రేటు వచ్చే దాకా రైతులు జగిత్యాల మార్కెట్‌లో నిరీక్షించాల్సి వస్తుంది. దీంతో పలువురు రైతులు తక్కువ ధరకు విక్రయించి నష్ట పోతున్నారు. రాయికల్ మండల కేంద్రంలో మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కేంద్రం ఏర్పాటుతో రవాణా భారం తప్పడంతో పాటు రాయికల్, మల్లాపూర్, మేడిపల్లి మండలాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని మండల రైతులు కోరుతున్నారు.



రవాణా భారం తప్పుతుంది
రాజేందర్, రైతు, చెర్లకొండాపూర్



మామిడి విక్రయాలకు సుమారు 30 కి.మీ. తీసుకువెళ్లడానికి వాహనాలు సమకూర్చాలంటే సుమారు ఒక్కో వాహనానికి ట్రిప్పుకు రూ.5 వేలు ఖర్చు అదనంగా అవుతుంది. రాయికల్ మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు రవాణా భారం తీరుతుంది.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి
ఎలగందుల ఉదయశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్



జిల్లాలోనే రాయికల్ మండలంలో రైతులు అత్యధికంగా మామిడి పంట సాగు చేస్తున్నారు. రాయికల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో రైతులకు ప్రయాణ భారం తగ్గుతుంది. మామిడి కొనుగోళ్లకు మండలం కేంద్ర బిందువుగా మారితే రైతులకు ప్రోత్సాహం లభిస్తుంది. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలి.

గుడి లేని దేవుడు

● రాతిపై వెలిసిన ఆదివరాహస్వామి
● ఏటా పెరుగుతూ వరాల స్వామిగా ప్రసిద్ధి
● ఈ నెల 30న ఉగాది సందర్భంగా ఉత్సవాలు

కమాన్‌పూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో వెలసిన ఆదివరాహస్వామి వరాల స్వామిగా భక్తుల కోరికలు నెరవేరుస్తున్నాడు. బండి రాతిపై వెలసిన స్వామివారికి గుడి లేదు. ఆరు బయటనే ఉండి నిత్యం భక్తుల పూజలు అందుకుంటారు. ఏటా స్వామివారి పరిమాణం పెరుగుతున్నట్లు ఇక్కడి భక్తులు చెప్పుకుంటారు. సుమారు 600 సంవత్సరాల క్రితం ఒక మహా రుషి తపస్సును మెచ్చి ప్రత్యక్షమైన శ్రీహరి, ఆ ఋషి కోరిక మేరకు ఆదివరాహస్వామి రూపంలో వెలసి భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నట్లు ప్రతీతి. స్వామి వారి రాతి విగ్రహం, ప్రతిఏటా పెరుగుతూ వస్తుండడం ఇక్కడి ప్రధాన ప్రత్యేకత. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండు మాత్రమే ఆది వరాహస్వామి ఆలయాలు ఉండగా, శ్రీవారు కొలువై ఉన్న తిరుమల ప్రాంతంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమాన్‌పూర్ మండలంలో ఉన్న ఈ ఆలయం రెండోదిగా ప్రాచుర్యం పొందింది.



బండల మధ్యనే ఆదివరాహస్వామి వారి ఆలయం

ఆలయానికి ఇలా చేరుకోవాలి..

స్వామివారిని దర్శించుకోవాలంటే కరీం నగర్ నుంచి గోదావరిఖనికి కమాన్‌పూర్ మీదుగా వెళ్లే ప్రత్యేక బస్సులుంటాయి. కరీంనగర్ నుంచి కమాన్‌పూర్ మీదుగా పెద్దపల్లికి ఆర్టీసీ బస్సులు వెళ్తాయి. దేవాలయానికి దగ్గరగా ఉన్న రైల్వేస్టేషన్ పెద్దపల్లి. అక్కడి నుంచి ఆర్‌టీసీ బస్సులు, ఆటోల సౌకర్యం కూడా ఉన్నది.





రాతిపై స్వామివారు, ఆలయం ముఖద్వారం

ప్రతి మాసంలో కల్యాణం

భక్తుల కోరిక మేరకు ప్రతి మాసంలో కల్యాణం నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ప్రతి మాసంలో ఆదివరాహ స్వామి కల్యాణం నిర్వహించడం వల్ల భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. ప్రతి ఉగాదితో పాటు, శ్రావణ మాసంలో స్వామివారి జయంత్యోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో కాంతారెడ్డి తెలిపారు. ఈ యేడు ఉగాదికి ప్రత్యేక పూజలు చేపట్టినట్లు తెలిపారు.

సీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర స్థాయి కాయకల్ప బృందం

ఎల్లారెడ్డిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్రస్థాయి కాయకల్ప బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. రాష్ట్రస్థాయి బృందం, సిద్దిపేట జిల్లా నంగునూర్‌లోని సీహెచ్‌సీ వైద్య అధికారులు మంజుల, శ్రావణి, శ్వేత, లిఖితలు ఆరోగ్య కేంద్రంలోని పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్, స్థానిక వైద్యులు అజయ్‌కుమార్, బాబు, రఘు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సీహెచ్‌సీని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

● సంక్షిప్తంగా

కరీంనగర్ టౌన్: నగరంలోని 6వ డివిజన్‌లో పైపులైను కోసం తవ్విన రోడ్డుకు మరమ్మతు చేయాలని డివిజన్‌కు చెందిన కాంగ్రెస్‌నాయకుడు, న్యాయవాది వాసాల హరీష్, మున్సిపల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ కన్వీనర్ దుగ్గు మహేందర్ రాకేశ్ బుధవారం కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్ క్రైం: ఇటీవల అగ్ని ప్రమాదంలో తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరణించిన ఏఎస్సై రామస్వామి కుటుంబానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి మంజూరైన రూ.70 లక్షల బీమా చెక్‌ను పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం బుధవారం అందజేశారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు నిర్వహించనున్న వసంత నవరాత్రోత్సవాల కరపత్రాన్ని బుధవారం ఆలయంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు గౌతమరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

కరీంనగర్ కల్చరల్: ఓ టీవీ ఛానల్‌లో నిర్వహిస్తున్న డ్రామా జూనియర్స్ 8కి కరీంనగర్‌కు చెందిన బేబీ గడుగు శరణ్య ఎంపికవగా బుధవారం చిన్నారిని మాస్క్ సంస్థకు చెందిన పలు వురు కళాకారులు అభినందించారు.

కరీంనగర్ అర్బన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకో వాలని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు.

కరీంనగర్ టౌన్: నగరపాలక సంస్థ స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన మల్టిపర్పస్ పార్కులో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగంటి అనిల్ బుధవారం కార్పొరేషన్ ప్రత్యేకాధికారి,కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్ టౌన్: ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్‌లోని నవరన్ వీధి సెక్టార్ 23వ డివిజన్ సుభాష్‌నగర్‌లో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం గంగమ్మ, పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు.

● బడీడు పిల్లలను, వర్క్‌సైట్ స్కూళ్లలోని మైగ్రేటెడ్ అవాస విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించి తరగతులు నిర్వహించాలని ఎంఈవో రవీందర్ సూచించారు.

ఇంజనీరింగ్, లా కళాశాలల మంజూరుపై హర్షం



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వీసీ ఉమేష్‌కుమార్

కరీంనగర్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని కరీంనగర్‌లో లా కళాశాల, హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్ కలిశారు.

కరీంనగర్ లీగల్: ఎస్‌యూ పరిధిలో న్యాయ కళాశాల మంజూరుపై కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో స్వీట్లను పంపిణీ చేశారు. లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కల్లెపల్లి లక్ష్మయ్య, స్టేట్ జాయింట్ కన్వీనర్ భూక్య రజనీష్ సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కొత్తకొండ శంకర్, కో కన్వీనర్ సృజన్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: ప్రభుత్వ లా, ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరుపై బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మంకమ్మతోటలోని బీసీ సంక్షేమ, అనుబంధ సంఘాల ఆధ్వ ర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వ హించారు.

కరీంనగర్ అర్బన్: యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు పంజాల కృపాసాగర్ ఆధ్వర్యంలో బుధవారం కోర్టు చౌరస్తా వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొన్నం మధు, కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి మడుగుల ప్రవీణ్, అర్జున్ గౌతం, కరీంనగర్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు జెగ్రిపోతుల వాసు, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్‌ను కలిసిన సుడా చైర్మన్



ఢిల్లీలో మీనాక్షి నటరాజన్‌తో నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కలిశారు. బుధవారం ఢిల్లీలో తెలంగాణలోని జిల్లా, నగరశాఖ అధ్యక్షులతో స్థానిక పరిస్థితులు, పార్టీ క్యాడర్, సీనియర్ నాయకులు, కష్టపడి పనిచేసిన కార్యకర్తల వివరాలతోపాటు పలు అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నిజామాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణుతో కలిసి నరేందర్‌రెడ్డి భేటీ అయ్యారు.

కేసీఆర్ నిర్వాకాలు చెబితే ఉలికిపాటెందుకు?

కరీంనగర్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ నిర్వాకాలు చెబితే బీఆర్ఎస్ శ్రేణులకు ఉలికిపాటెందుకని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ అన్నారు. బుధవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ నిర్వాకులు తెలిసిన వాళ్లకు అసలు బాగోతం ఏమిటో చెప్పనక్కర్లేదని, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని అన్నారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్ ప్రజాక్షేత్రంలో నుంచి వచ్చిన నాయకుడు కాదని, ఆయన ఏ ఎన్నికల్లో కూడా పోటీచేసి గెలిచిన చరిత్ర లేదని, నామినేటెడ్ పొలిటీషియన్ అని విమర్శించారు. బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు కాసర్ల ఆనంద్, వంగల శ్రీదేవిపవన్, బండ రమణారెడ్డి, కొలిపాక శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, గాయత్రీదేవి, శ్రీనివాస్, సాయి, ప్రసన్న పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జిపై దృష్టి సారించండి

కరీంనగర్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మానేరు నదిపై రూ.194 కోట్లతో నిర్మించిన కేబుల్ బ్రిడ్జి రెండేళ్లు తిరగకుండానే అధ్వానంగా మారిందని, మరమ్మతుపై దృష్టి సారించాలని మాజీ మేయర్, బీజేపీ నాయకుడు యాదగిరి సునీల్‌రావు కోరారు. బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. బ్రిడ్జి అధ్వానంగా మారడంతో రాకపోకలు తగ్గిపోయాయని, డైనమిక్ సిస్టమ్ లైటింగ్ వెలుగడం లేదని, రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. స్ట్రీట్‌లైట్లు వెలగడం లేదని, పోల్స్ విరిగిపోయాయని తెలిపారు. వీటిపై ప్రత్యేక దృష్టిపెట్టి బ్రిడ్జిపై రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్రవర్ణ పేదలకు 'రాజీవ్ యువ వికాస్' హర్షణీయం

కరీంనగర్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఓసీల్లోని ఈడబ్ల్యూఎస్ పేదలకు రాజీవ్ యువ వికాస్ పథకం వర్తింపజేయడం హర్షణీయమని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు అన్నారు. బుధవారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో మాట్లాడారు. ఓసీ వర్గాలకు పథకాన్ని వర్తింపజేయడంపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

2 నుంచి ప్రజా చైతన్య యాత్ర

కరీంనగర్ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నియోజక వర్గంలోని ప్రతీ గ్రామంలో ఏప్రిల్ 2 నుంచి 10వ తేదీ వరకు జైబాపు, జైభీమ్ జై సంవిధాన్ అభియాన్ ప్రజా చైతన్య యాత్ర చేపట్టాలని కాంగ్రెస్ కరీంనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ మండలం చెర్లబూత్కూర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్‌ను అవమానపరిచేలా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

కరీంనగర్‌లో కళాశాల ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కేంద్రంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఎస్‌యూలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి యూనివర్సిటీలో విద్యా ప్రమాణాలు పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి హేమంత్ తదితరులు ఉన్నారు.

ధర్మభిక్షం జయంతి, వర్ధంతి నిర్వహించాలి

భగత్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మార్చి26(ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టూ ఏడీఈ శ్రీనివాస్ గౌడ్, లావణ్య తెలిపారు. రాజీవ్ చౌక్, రూరల్ పోలీస్ స్టేషన్, భారత్ టాకీస్, టవర్ సర్కిల్, బ్రాహ్మన్ వీధి, అహ్మద్‌పురా, ద్వారక నగర్, వాల్మీకి నగర్, ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జ్యోతినగర్, కూర్మవాడ, కోర్టు వాటర్ వర్క్స్ ఏరియా, సాయంత్రం 4 గంటల నుంచి 4:45 వరకు శక్తి ఆలయం, బాలాజీ సూపర్ మార్కెట్ ఏరియా, శ్రీరామ ఫంక్షన్ హాల్, భాగ్యనగర్, వీరభద్ర అపార్ట్‌మెంట్, గీతాభవన్ వెనుక వైపు, కార్పెంటర్ సొసైటీ, సంతోష్ మాత దేవాలయం ఏరియా, కొత్త లేబర్ అడా, సాయి బాబా దేవాలయం ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మల్లేశం



మల్లేశంను అభినందిస్తున్న చల్ల హరిశంకర్

సుభాష్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లా కేంద్రంలోని కాపువాడకు చెందిన ఆది మల్లేశం నియామకమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం నగరంలోని మంకమ్మతోటలో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ అభినందనలు తెలిపారు. రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, జిల్లా సమన్వయకర్త బొల్లం లింగమూర్తి, ముప్పిడి సునీల్, ఆవుల శ్రీనివాస్, నితిన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత

గణేశ్‌నగర్, మార్చి26 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారు, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత అన్నారు. రైజింగ్ సన్ యూత్ క్లబ్ చేపట్టిన సరైన అవగాహనే.. సైబర్ నేరాలకు నివారణ అనే పోస్టర్‌ను నగరంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. రైజింగ్ సన్ యూత్ క్లబ్ అధ్యక్షుడు గజ్జెల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలు ఆరోగ్యానికి మేలు

భగత్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో పండించిన పంటలతో ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వినరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు వారధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నాగి శేఖర్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన బీజేపీ, బీఆర్ఎస్

కరీంనగర్ అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ పదేళ్లుగా ప్రజలను మోసం చేశాయని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అజీమ్ అన్నారు. నగరంలోనిడీసీసీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శిం చే స్థాయి బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌కు లేదన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు ఫహద్, వాసు, అనిల్, అంజిత్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

వాగేశ్వరి డిగ్రీ కళాశాల విద్యార్థుల మానవహారం

భగత్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వాగేశ్వరి కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో బుధవారం బద్దిపల్లి, కమాన్‌పూర్ గ్రామాల్లో విద్యార్థినులు మానహారం, ర్యాలీ నిర్వహించారు. ఈ రాజకీయ నాయకులు గవ్వ వంశీధర్‌రెడ్డి, ఓంకార్, వంకాయల శేఖర్, బొద్దుల శ్రావణ్‌కుమార్, మీనాక్షి, వాగేశ్వరి కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ముస్లిం మతపెద్దలు, కాంగ్రెస్ నాయకులతో నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని అల్ఫోర్స్ జెన్‌నెక్స్ మైదానంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏ-ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్: ఎంఐఎం ఆధ్వర్యంలో కాశ్మీర్ గడ్డ ఐబీపీ గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ హాజరయ్యారు. ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ పాల్గొన్నారు.

తిమ్మాపూర్: ఎల్ఎండీ కాలనీలోని అరుంధతి కల్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందుఇచ్చారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, ముస్లింలు పాల్గొన్నారు.

గంగాధర: మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్‌విందులో మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

రోడ్డు నిర్మాణానికి ఇంకెన్నేళ్లు?



అన్నారంలో అసంపూర్తిగా తారు రోడ్డు

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు ఏడేళ్లక్రితం డబుల్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. మండలకేంద్రం నుంచి పచ్చునూర్‌గ్రామం వరకు 15కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉంది. అన్నారం గ్రామంలో సుమారు 200మీటర్ల వరకు ఇప్పటికీ తారు వేయకపోవడంతో దుమ్ము, దూళితో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కంకరపోసి వదిలేయడంతో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. రోడ్డంతా గుంతలమయంగా తయారై ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా మానకొండూర్-వేగురుపల్లి రోడ్డు



వెల్ది-లక్ష్మీపూర్ గ్రామాల మధ్య కంకర తేలిన రోడ్డు

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నుంచి వేగురుపల్లి వరకు తారు రోడ్డు నిర్మించాలని ఆయాగ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు. మండలకేంద్రం నుంచి శ్రీనివాసనగర్, జగ్గయ్యపల్లి, లింగాపూర్, వెల్ది, లక్ష్మీపూర్, వేగురుపల్లి వరకు 17కిలోమీటర్లు గతంలో వేసిన తారు రోడ్డు పూర్తిగా చెడిపోయింది. దీంతో కంకర తేలి రోడ్డంత గుంతలమయంగా తయారు కావడంతో ద్విచక్రవాహనదారులు ఎక్కడ అదుపు తప్పి పడిపోతామోనని ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ బస్సు వెళ్లే క్రమంలో తేలిన కంకర తాకి ప్రమాదం జరుగుతుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైతులకు వారధిగా సహకార సంఘాలు

● వెన్కేపల్లి సహకార సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న వెన్కేపల్లి సహకార సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి

సైదాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు సహకారసంఘాలు వారధిలాగా పనిచేస్తున్నాయని వెన్కేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెన్కేపల్లి విశాల సహకారపరపతి సంఘం 64వవార్షిక సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షుడు కొత్తతిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగింది. సంఘం వార్షిక నివేదికను సీఈవో శ్రీధర్ రైతులకు చదివి వినిపించారు. అనంతరం కొత్త తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మునిపాల రవి, బొమ్మగాని రాజు, నమిండ్ల జమున, గుండేటి జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

శంకరపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ గ్రామంలో బుధవారం కేశవపట్నం వీనస్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ కనకం శ్రీనివాస్ 300మందికి బీపీ, షుగర్, సీబీసీ వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు మహేష్, వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

29న కేశవపట్నం వారసంత వేలం

శంకరపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నంలో నిర్వహించే వారసంతవేలంపాట ఈనెల29న ఉదయం10గంటలకు గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి కృష్ణప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు మొదట రూ.10వేలు ధరావత్ చెల్లించాలన్నారు. వేలం దక్కించుకున్నవారు 50శాతం డబ్బు వేలంరోజే చెల్లించాలని, మిగతా50శాతం విడతలవారీగా చెల్లించవచ్చని తెలిపారు.

చొప్పదండి: పట్టణంలోని వారసంత, మేకల సంతకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వేలం జరిగింది. 2025-26 ఆర్థికసంవత్సరానికి వేలం నిర్వహించారు. కూరగాయల సంతను చేట్పల్లి శ్రీనివాస్, మేకల సంతను నూను చంద్రయ్య దక్కించుకున్నారు. వేలంతో మున్సిపాలిటీకి 15లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని కమిషనర్ నాగరాజు తెలిపారు.

డంపింగ్‌యార్డు పరిశీలన

హుజూరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌పరిధి ఇప్పల్‌నర్సింగాపూర్‌లోని డంపింగ్‌యార్డును కంపోస్టు డెవలప్‌మెంట్ అధికారి హేమలత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేయడం వలన కలిగే ప్రయోజనాలు, ఎరువుల తయారీ విధానంపై వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈ సాంబరాజు, మేనేజర్ భూపాల్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, ఎండీ రషీద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ సభ్యులకు సన్మానం

హుజూరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో బుధవారం ప్రెస్‌క్లబ్ (టీయూడబ్ల్యూజే ఐజేయూ) కమిటీసభ్యులను కళారవళి అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాగార్జున డెయిరీ చైర్మన్ పుల్లూరిప్రభాకర్‌రావు, విష్ణుదాస్‌గోపాల్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

మారథాన్‌లో రాణించిన జ్యోతిష్మతి విద్యార్థులు

తిమ్మాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅండ్‌సైన్స్‌కు చెందిన విద్యార్థులు హైదారాబాద్‌లోని టాస్క్ సెంటర్లో జరిగిన కోడ్ ఉన్నతి ఇన్నోవేషన్ మారథాన్‌లో రాణించినట్లు విద్యాలయ చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. సీఎస్ఈ, సీఎస్ఎం చివరి సంవత్సరం చదువుతున్న గండ అజిత్, ల్యాగల మహేందర్, శానగొండ అక్షిత్ పాల్గొని రెండోస్థానంలో నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులను చైర్మన్ జువ్వాడిసాగర్‌రావు, సెక్రెటరీ, కరస్పాండెంట్‌సుమిత్‌సాయి,ప్రిన్సిపాల్ అభినందించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా వార్షికోత్సవం

రామడుగు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేటలోని అల్ఫోర్స్ హైస్కూల్ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది.చొప్పదండి సీఐ ప్రకాష్‌గౌడ్, విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంస్కృతికకార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

సెల్‌ఫోన్ అందజేత

వీణవంక, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపేటకిచెందిన రవీందర్ సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పీఎస్‌లో ఫిర్యాదుచేశాడు. పోలీసులు సీఈఐఆర్‌పోర్టల్‌ద్వారా ఫోన్‌నురికవరీచేసి బుధవారం బాధితుడికి అందించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

మానకొండూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా మానకొండూర్‌తోపాటు, అన్నారం, కొండపల్కల, గంగిపల్లి, పచ్చునూర్, ఊటూర్, గట్టుదుద్దెనపల్లి, లింగాపూర్, వెల్ది, లలితాపూర్, వేగురుపల్లి, రంగపేట, మద్దికుంట, దేవంపల్లిలో బుధవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బోనాలను పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు త్వరగా పూర్తి చేయాలి

కరీంనగర్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం (ట్రీట్‌మెంట్ ప్లాంట్) పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. బొమ్మకల్ సమీపంలోని మురుగునీటి శుద్ధి కేంద్రం ఆవరణలో చేపట్టిన ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను బుధవారం పరిశీలించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలోని సెప్టిక్ ట్యాంకులు, పబ్లిక్, కమ్యూనిటీ టాయిలెట్స్ నుంచి సెప్టిక్ క్లీనర్ ట్యాంకర్ల ద్వారా సేకరించిన మానవ వ్యర్థాలను ప్లాంట్‌లో శుద్ధీకరించి ఎరువుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్ష విరమణ



రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు బొకే అందించి ధన్యవాదాలు తెలుపుతున్న జేఏసీ నాయకులు

తిమ్మాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మహనీయుల విగ్రహాలకు ముసుగును తొలగించి ఆవిష్కరించేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం ఆయన మండలకేంద్రంలో జేఏసీ నాయకులు చేస్తున్న దీక్షాశిబిరాన్ని సందర్శించి వారికినిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో జేఏసి నాయకులు దుండ్ర రాజయ్యయాదవ్, మాతంగి శంకర్, సుగుర్తిజగదీశ్వరాచారి, కనకంరాములు, నాయకులు పాల్గొన్నారు.

నియామకం

హుజూరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ అంబేద్కర్ జయంతి కమిటీ చైర్మన్‌గా మారేపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని బీఎస్సార్‌గార్డెన్‌లో అంబేద్కర్ జయంతికమిటీ ఎన్నిక సమావేశం కమిటీ మాజీచైర్మన్ మహ్మద్ ఖాలీక్‌హుస్సేన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ జయంతి కమిటీ అధ్యక్షుడిగా మారేపల్లి శ్రీనివాస్ ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు తెలిపారు.

సహకార సంఘ సర్వసభ్య సమావేశం

శంకరపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ కేతిరి మధుకర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీఈవో పోలు వీరస్వామి నివేదిక చదివి వినిపించారు. హుజూరాబాద్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ సహకారసంఘాల పనితీరు ఫలితాలు గురించి వివరించారు. కార్యక్రమంలో రమణారెడ్డి, సత్యనారాయణరావు, సమ్మయ్య, ప్రవీణ్, శేషచారి, వేణు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.